డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
ఉమ్మడి కరీంనగర్
పెద్దపల్లి,జగిత్యాల, రాజన్న సిరిసిల్ల.
శుక్రవారం24 జూలై 2026

## రాష్ట్ర శ్రేయస్సుకు మంత్రి ప్రత్యేక పూజలు

రైతాంగ సంక్షేమం కోరుతూ యాగాల్లో పాల్గొన్న పొన్నం.
సమృద్ధి వర్షాల కోసం ఆలయాల్లో ప్రార్థనలు.
ఎల్‌నినో ప్రభావం తొలగాలని ఆకాంక్ష.



**జనం వాయిస్, హుస్నాబాద్, జూలై 23:**

రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతాంగం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో జీవించాలని కోరుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం హుస్నాబాద్ పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా హుస్నాబాద్‌లోని శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్న మంత్రి, అనంతరం అయ్యప్ప ఆలయంలో 108 మంది రుత్వికులు, 21 హోమగుండాలతో నిర్వహించిన శ్రీ వారాహి మూలమంత్ర హోమ మహాయజ్ఞంలో పాల్గొన్నారు. వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురవాలని ప్రార్థించారు. తదుపరి శ్రీకృష్ణ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం 108 కలశాలతో మరకత శివాలయంలో నిర్వహించిన వరుణ యాగంలో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలోని చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోవాలని, రైతుల పంటలు సమృద్ధిగా పండాలని, వ్యవసాయం

2

## యంగ్ ఇండియా పాఠశాల పనుల పరిశీలన

నిర్మాణ నాణ్యతపై కలెక్టర్ ప్రత్యేక సమీక్ష.
గడువులోగా పనులు పూర్తి చేయాలని ఆదేశం.
విద్యార్థులకు అత్యాధునిక వసతులే లక్ష్యం.



**జనం వాయిస్, జగిత్యాల, జూలై 23:**

ధర్మపురి నియోజకవర్గంలోని నేరెళ్ల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత, మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. నిర్మాణంలో ఉన్న విద్యా భవనాలు, తరగతి గదులు, - మిగతా 2 లో ...

## కేటీఆర్ జన్మదిన వేడుకలు

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

2



**జనం వాయిస్, పెద్దపల్లి:**
రాష్ట్ర సాధనలో, రాష్ట్ర భవిష్యత్తును టెక్నికల్, పారిశ్రామిక రంగాలలో అగ్రగామిగా నిలపడంలో బీఆర్ఎస్ వర్కింగ్




## కాంగ్రెస్ వి హింసాత్మక రాజకీయాలు

బీజేపీ నేత సునీల్ రావు

2

## డ్రగ్స్‌కు దూరంగా ఉండి.. ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకుందాం.

రాష్ట్ర అటవి పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ.
తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో హన్మకొండ లో 2కె రన్.

2



దైనమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక RNI NO:TGTEL/26/A0383 WWW.JANAMVOICE.COM



# రాష్ట్ర శ్రేయస్సుకు మంత్రి ప్రత్యేక పూజలు

**మొదటి పేజీ తరువాయి ...**

అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆలస్యమవుతున్న నేపథ్యంలో రైతాంగం ఆందోళన చెందుతోందని మంత్రి పేర్కొన్నారు. దేవతల అనుగ్రహంతో రాష్ట్రవ్యాప్తంగా సమృద్ధిగా వర్షాలు కురిసి వ్యవసాయ రంగం పుంజుకోవాలని, రైతులు ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. రైతు అభివృద్ధి చెందితేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని,



రైతు సంతోషంగా ఉంటే వ్యాపారులు, కార్మికులు, చేతివృత్తులవారు సహా సమాజంలోని ప్రతి వర్గం అభివృద్ధి చెందుతుందని మంత్రి అన్నారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సంక్షేమంతో పాటు సమాజ శ్రేయస్సు కోసం కూడా ప్రార్థించాలని పిలుపునిచ్చారు. ఈ మహాయజ్ఞాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న వేద పండితులు, నిర్వాహకులు, యజ్ఞ దంపతులను మంత్రి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మీ, వైస్ చైర్మన్ చిత్తారి పద్మ, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వేద పండితులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# యంగ్ ఇండియా పాఠశాల పనుల పరిశీలన

**మొదటి పేజీ తరువాయి ...**

విద్యార్థుల వసతి గృహాలు, భవనాల రూపకల్పన, ఇతర సౌకర్యాలను కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. ప్రతి పనిలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణం చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి రాజీ లేకుండా పనులు పూర్తిచేయాలని స్పష్టం చేశారు. పాఠశాల నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆధునిక విద్యా వాతావరణానికి అనుగుణంగా అన్ని సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు సురక్షితమైన, సౌకర్యవంతమైన వసతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తాగునీటి సదుపాయం, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, అంతర్గత రహదారులు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. నిర్మాణ పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నాణ్యతలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ద్వారా ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యా సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందని కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడంలో ఈ



పాఠశాలలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, తహసీల్దార్ శ్రీనివాస్, సంబంధిత శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు. నిర్మాణ పనులను నిరంతరం సమీక్షిస్తూ గడువులోగా పూర్తిచేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

# డ్రగ్స్‌కు దూరంగా ఉండి.. ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకుందాం.

**జనం వాయిస్, హన్మకొండ, జూలై 23:** తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్ (TSJU) హనుమకొండ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం ‘Break Free from Drugs Build a Bright Future’, ‘Say No to Drugs’ నినాదాలతో హనుమకొండ కలెక్టరేట్ నుంచి కాళోజీ జంక్షన్ వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవి పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ ర్యాలీలో ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.






వెంకన్న, హనుమకొండ అదనపు కలెక్టర్ రవి, వరంగల్ డీసీపీ ధారా కవిత, తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి 2కే రన్‌ను ప్రారంభించారు. అనంతరం అధికారులు, విద్యార్థులు, జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రజలతో కలిసి “సే నో టు డ్రగ్స్“ ప్రతిజ్ఞ చేయించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, సమాజ నిర్మాణంలో బాధ్యతాయుతమైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో నార్కోటిక్స్ డీఎస్పీ రమేష్ , డిటిఓ జనార్ధన్ రెడ్డి, ఎంవీఐ కిరణ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి అప్పయ్య, డి పి ఆర్ ఓ అయుబ్ అలీ ,కుడా మాజీ చైర్మెన్ సుందర్ రాజ్ యాదవ్ తో పాటు జర్నలిస్ట్ యూనియన్ బాధ్యులు ,పెద్ద సంఖ్యలో విద్యార్థులు, యువత, ఎన్ సి సి క్యాడెట్స్, ఎన్ ఎస్ ఎస్, జర్నలిస్టులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు.


# కేటీఆర్ జన్మదిన వేడుకలు

**మొదటి పేజీ తరువాయి ...**

ప్రెసిడెంట్, రాష్ట్ర మాజీ మంత్రి కల్వకుం ట్ల తారక రామారావు చేసిన కృషి చిరస్మరణీయమ ని టీఎస్టీఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ చిరుమిల్ల రాకేష్ కుమార్ కొనియాడారు. కేటీఆర్ 50వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గురువారం ముందస్తు వేడుకలను గులాబీ శ్రేణులు అత్యంత ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా డాక్టర్ చిరుమిల్ల రాకేష్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల ను పరామర్శించి, వారికి స్వయంగా పండ్లు,బ్రెడ్లను పంపిణీ చేశారు. కేటీఆర్ ఆయురారోగ్యాలతో పరిపూర్ణమైన జీవితాన్ని గడపాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాకేష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 24న హైదరాబాద్లోని ఇందిరా పార్క్ వద్ద నీట్ వ్యతిరేక ఉద్యమంలో విద్యార్థులపై జరిగిన లాఠీచా ర్జికి నిరసనగా తలపెట్టిన ధర్నా కార్యక్రమం లో పాల్గొనేందుకు పెద్దపల్లి నుంచి బీఆర్ఎస్ శ్రేణులు, విద్యార్థి విభాగం, యువత పెద్దఎత్తున తరలి వెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ నేపథ్యంలోనే ఒకరోజు ముందే పెద్దపల్లిలో కేటీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం లో ఉండి రోడ్లపై ధర్నాలు చేయాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యమని, కేంద్రం లో నీట్ పేపర్ లీకేజీకి కారణ మైన బీజేపీ,ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసుల వద్ద దిష్టిబొమ్మలు దహనం చేయడం,నిరసనలు తెలపడం విడ్డూరంగా ఉంద న్నారు. గ్రూప్-1 ఇంటర్వ్యూ లకు పిలిచిన 3,200 మందికి పైగా అభ్యర్థుల వివరాలు ఇప్పటివరకు వెల్లడించకపో వడం, అలాగే నీట్ పీజీ పరీక్షలో జీరో మార్కులు వచ్చిన వారికి కూడా వాలిడి టీ ఇస్తూ సీట్లు కేటాయించడం పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశా రు. ప్రభుత్వాల ప్రజా వ్యతి రేక విధానాలను ఎండగట్టేం దుకే ఈ నిరసన కార్యక్రమా లు చేపడుతున్నట్లు తెలిపా రు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మోబిన్, మాజీ కౌన్సిలర్లు బిక్షపతి,స్వామి,ఉపసర్పంచ్ మేకల కుమార్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కర్రె దేవేందర్ రెడ్డి, పడాల సతీష్ గౌడ్,బింగి రాజు,మేడుడుల రాజ్ కుమార్,ఉప్పు శివ కుమార్,బోయిని మనోజ్,పెంచాల శ్రీకాంత్,శ్రీకాంత్,కంచి నాగరాజ్,దాసరి సతీష్,ఇరుగురాల స్వామి దాస్,సాయి, వెంకటేష్లతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ వి హింసాత్మక రాజకీయాలు

**జనం వాయిస్, కరీంనగర్:**




నీట్ పరీక్షను సాకుగా చేసుకుని కాంగ్రెస్ పార్టీ హింసాత్మక రాజకీయాలకు పాల్పడుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు ఆరోపించారు. గురువారం కరీంనగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీట్ పరీక్షలపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ, కాంగ్రెస్ రాజకీయ లబ్ధి కోసం ఆందోళనలను రెచ్చగొడుతోందని విమర్శించారు. పార్లమెంట్, పోలీసులపై దాడులు చేయడం ప్రజాస్వామ్యబద్ధమైన ఆందోళన కాదని అన్నారు. పోటీ పరీక్షల లీకేజీలపై కాంగ్రెస్ గత పాలనలో ఎవరైనా మంత్రులు రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు గడిచినా జాబ్ క్యాలెండర్, ఉద్యోగాల హామీల అమలు ఎక్కడుందని నిలదీశారు. ప్రజా సమస్యలపై ప్రజాస్వామ్యబద్ధంగా చర్చించేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని, హింసాత్మక చర్యలను మాత్రం సహించబోమని సునీల్ రావు హెచ్చరించారు.

# వాహనాల పాత సామగ్రికి బహిరంగ వేలం.

## రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిషోర్ ఝా.

**జనం వాయిస్, రామగుండం, జూలై 23:**




రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీస్ వాహనాలకు సంబంధించిన పాత స్పేర్ పార్ట్స్,టైర్లు, బ్యాటరీలు, ఉపయోగించిన ఇంజిన్ ఆయిల్‌ను ఈ నెల 27వ తేదీన కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన ఆసక్తి గల వ్యక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. మరిన్ని వివరాల కోసం ఎంటీవో మల్లేశంను 8712656616 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కల్పిస్తే కఠిన చర్యలు.

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.
- పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామ సర్పంచ్ కి షోకాస్ జారీ.

**జనం వాయిస్, పెద్దపల్లి, జూలై 23:**



ప్రభుత్వ అధికారులు తమ విధులను నిర్వహించే సమయంలో ఆటంకాలు కల్పించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, బెదిరింపులకు పాల్పడడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని పెద్దపల్లి మండలం రంగాపూర్ గ్రామ సర్పంచ్ కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లి మండలంలోని రంగాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ గంట రమేష్ ప్రభుత్వ అధికారిని విధుల నిర్వహణలో అడ్డుకోవడం, అసభ్యకర, అనుచిత పదజాలంతో దూషించడం, బెదిరింపులకు పాల్పడినట్లు సహాయ కార్యనిర్వహణ ఇంజనీర్, ఎం.బి. ఇంట్రా, పెద్దపల్లి అందజేసిన ఫిర్యాదు మేరకు తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 37(1)(ii), 37(1)(iii) ప్రకారం షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ఫిర్యాదును ప్రాథమికంగా పరిశీలించగా, అందులో పేర్కొన్న ఆరోపణలు సంబంధిత చట్టంలోని నిబంధనల పరిధిలోకి వస్తున్నట్లు గుర్తించిన నేపథ్యంలో, సంబంధిత సర్పంచ్‌కు కారణం చెప్పాలని కోరుతూ షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. షోకాజ్ నోటీసు అందిన తేదీ నుంచి ఏడు రోజులలోపు లిఖితపూర్వక సంజాయిషీని సమర్పించాలని ఆదేశించినట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులోగా సంజాయిషీ సమర్పించనట్లయితే, అందుబాటులో ఉన్న రికార్డులు, సాక్ష్యాధారాల ఆధారంగా తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, 2018 ప్రకారం తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రభుత్వ అధికారులు చట్టబద్ధమైన విధులను నిర్వర్తిస్తారని, వారి విధుల నిర్వహణకు ఆటంకం కల్పించడం, బెదిరించడం లేదా అనుచితంగా ప్రవర్తించడం చట్టరీత్యా తీవ్రమైన విషయమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పర గౌరవం, సమన్వయంతో ప్రజా ప్రయోజనాల కోసం పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# మంథని పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి.

- రూ.43,540 నగదు, 52 పేకముక్కలు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం.
- నలుగురు అరెస్టు.



**జనం వాయిస్, మంథని, జూలై 23:**

రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు నేరాల నియంత్రణలో భాగంగా టాస్క్‌ఫోర్స్/నార్కోటిక్ బృందం చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోని గుంజపడుగు గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి నిర్వహించారు. నమ్మదగిన సమాచారం మేరకు గుంజపడుగు గ్రామంలో కొందరు వ్యక్తులు నగదును పందెంగా పెట్టుకుని మూడు ముక్కల పేకాట ఆడుతున్నట్లు తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని దాడి నిర్వహించారు. ఈ దాడిలో నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 52 పేకముక్కలు, రూ.43,540 నగదు, 3 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. అతని కోసం గాలింపు చర్యలు చేపట్టామని, త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని వెల్లడించారు. తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పట్టుబడిన నిందితులను, స్వాధీనం చేసుకున్న నగదు మరియు ఇతర వస్తువులతో కలిసి మంథని పోలీస్ స్టేషన్ అధికారులకు అప్పగించారు.

# సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో త్రాగునీటి సరఫరాకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి.

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష.
- ప్రత్యామ్నాయ త్రాగునీటి కార్యాచరణ ప్రణాళికలు సిద్ధంగా ఉంచాలి.
- సెప్టెంబర్ నాటికి బోర్‌వెల్, చేతి పంపుల వద్ద రీఛార్జ్ గుంతలను 100 శాతం పూర్తి చేయాలి.
- మిషన్ భగీరథ, గ్రిడ్ పెండింగ్ పనులు ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తిచేయాలి.



**జనం వాయిస్, పెద్దపల్లి, జూలై 23:**

సూపర్ ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో త్రాగునీటి సరఫరాను నిరంతరాయంగా కొనసాగించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మిషన్ భగీరథ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పలు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని త్రాగునీటి సరఫరాకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. జిల్లాలో త్రాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ త్రాగునీటి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో త్రాగునీటి సరఫరాకు సంబంధించి చేపట్టిన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యక్ష పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో త్రాగు నీటి సరఫరా మరింత సజావుగా జరిగేందుకు అవసరమైన అదనపు పనులు ఏవైనా ఉంటే వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని అన్ని బోర్‌వెల్, చేతి పంపుల వద్ద వర్షపు నీటి సంరక్షణకు ఉపయోగపడే రీఛార్జ్ గుంతల నిర్మాణాన్ని వేగవంతం చేసి, సెప్టెంబర్ నెలాఖరు నాటికి 100 శాతం పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూగర్భ జలాల పెరుగుదలకు ఈ చర్యలు ఎంతో ఉపయోగపడతాయని, పనుల్లో ఎలాంటి జాప్యానికి తావు లేకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. మిషన్ భగీరథ గ్రిడ్‌కు సంబంధించిన పెండింగ్ పనులను ఆగస్టు నెలాఖరు నాటికి పూర్తిచేసి పూర్తి స్థాయిలో త్రాగునీటి సరఫరాకు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మిషన్ భగీరథ గ్రిడ్ ఈ. ఈ.పూర్ణచందర్, మిషన్ భగీరథ ఇంట్రా ఎస్ఈ గంగాధర శ్రీనివాస్, డీఈలు, ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.